క్లుప్తంగా

మత్స్యశాఖ స్థలం పరిశీలన



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో గల మత్స్యశాఖ స్థలాన్ని శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ శంకర్ రాథోడ్ సోమవారం పరిశీలించారు. ఇక్కడ హోల్‌సేల్ చేపల మార్కెట్‌ను నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2కోట్లు మంజూరు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు ఇచ్చింది. త్వరలోనే మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో రాష్ట్ర శాఖ నుంచి జేడీ స్థల పరిశీలనకు వచ్చారు. తేదీని ప్రకటించి మంత్రులు, ఎమ్మెల్యేలను ఆహ్వానించి శంకుస్థాపన చేయనున్నట్లు జేడీ తెలిపారు. జిల్లా మత్స్య శాఖ ఏడీ నర్సింహారావు, గంగపుత్ర సంఘం నగర అధ్యక్షుడు పల్లికొండ అన్నయ్య, రవి, నరేందర్, ఆనంద్, బాల గంగాధర్, మాడవేడి వినోద్ కుమార్ ఉన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



మాక్లూర్: మండలంలోని మదన్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు సోమవారం అంకాపూర్‌లో బీజేపీ నియోజకవర్గ నాయకుడు పైడి రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఆయన వారికి పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. నాయకులు శ్రీనివాస్, అఖిలేష్, శివలాల్‌లు పాల్గొన్నారు.

జన్మాష్టమి వేడుకలను జయప్రదం చేయాలి



ఆర్మూర్ టౌన్: పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 6న నిర్వహించే శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తులు విజయవంతం చేయాలని ఇస్కాన్ సెంటర్ నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఆర్మూర్‌లోని ఇస్కాన్ సెంటర్‌లో సోమవారం వేడుకల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. సంస్థ సభ్యులు రామంతరాయ ప్రభుజీ, ఆది పురుష ప్రభుజీ, గంగేశ్వర్ హిమాయదాస్, భరత్, లవంగ కేశవ్ మాతాజీ, అపర గీత గౌరదేవి దాసి, కౌశిక్, మణికంఠ, జానర్దన్ పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన



రెంజల్(బోధన్): మండలంలోని దూపల్లి, కళ్యాపూర్ గ్రామాల్లో సోమవారం వరి పంటను ఏఈవో కవిత పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు, ఎండు ఆకు తెగులు ఉన్నట్లు గుర్తించామన్నారు. నివారణం కోసం రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు.

కరపత్రాల ఆవిష్కరణ



బాల్కొండ: ఆర్మూర్‌లో నిర్వహించే అఖిల భారత యాదవ పరిషత్ సమావేశాల కరపత్రాలను సోమవారం ముప్కాల్‌లో, వెంచిర్యాల్‌లో సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు. యాదవులు అధిక సంఖ్యలో తరలివచ్చి సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. మహేశ్, శ్రీకాంత్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా తీర్మానం



బాల్కొండ: రానున్న ఎన్నికల్లో మంత్రి ప్రశాంత్‌రెడ్డికి అండగా ఉంటామని మండలంలోని చిట్టాపూర్ గ్రామ కుర్మ సంఘం సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం తీర్మాన ప్రతిని సోమవారం బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్‌కు అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ వెంటే నడుస్తామన్నారు. సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెగిన రోడ్లు.. పారిన అలుగులు..





ఆర్మూర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి.. నిండు కుండలా మారిన మాందాపూర్ చెరువు

నందిపేట్/మాక్లూర్/ఆర్మూర్‌టౌన్/డొంకేశ్వర్/బోధన్/బాల్కొండ/మాక్లూర్/బోధన్‌టౌన్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో గత రెండురోజులుగా వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. నెల రోజుల నుంచి వర్షాలు ముఖం చాటేయడంతో పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ఈక్రమంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కుద్వాన్‌పూర్ - నందిపేట్ మార్గంలో ఉన్న భారీ వృక్షం రోడ్డుపై విరిగిపడడంతో ప్రజా రవాణా స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న ఎస్సై రాహుల్, సిబ్బంది, స్థానికుల సహాయంతో వృక్షాన్ని పక్కకు తొలగించారు. బోధన్‌లోని గాంధీ పార్కు వెనక భాగంలో గల ప్రహరీ కూలింది. మాక్లూర్ మండలంలో పలు జలాశయాలు నిండుకుండలా మారి ప్రమాదపు అంచుకు చేరుకున్నాయి. వర్షం ఇలాగే కొనసాగితే అత్యధిక చెరువులు, కుంటలు తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాల్కొండ మండలంలో 101.2 మిల్లీమీటర్లు, ము ప్కాల్ మండలకేంద్రంలో 98.2 మిల్లీమీటర్లు, మెండోరామండలంలో 98 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆర్మూర్‌లో 126.2 మి.మీ. వర్షం పడినట్లు అధికారులు తెలిపారు. ఆర్మూర్‌లో పలు ప్రాంతాలను ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పరిశీలించారు. రోడ్డుపై నిలిచిన వర్షపునీరు తొలగించాలని మున్సిపల్ అధికారులు ఆదేశించారు. డొంకేశ్వర్ మండలంలోని తొండాకూర్-కుద్వాన్‌పూర్ రోడ్డు మళ్లీ తెగిపోయింది. రోడ్డును మూసివేసినా, ప్రజలు ప్రాణాలకు తెగించి మరీ వాగును దాటుతున్నారు.




ఉధృతంగా ప్రవహిస్తున్న జన్నేపల్లి వాగు



కొత్తపల్లిలోని పంటపొలాల్లో వర్షపునీరు



బోధన్‌లోని గాంధీ పార్కులో కూలిన ప్రహరీ



డొంకేశ్వర్ మండలంలో కొట్టుకుపోయిన రోడ్డు





బోధన్ మండలం నాగన్‌పల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పసుపువాగు.. ఆర్మూర్‌లోని హైవేపై నీరు

ప్రజాసేవకు అంకితమై ఉంటా





నందిపేట్‌లో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి.. బీఆర్ఎస్‌లో చేరుతున్న రజకసంఘ సభ్యులు

- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- నందిపేట్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

నందిపేట్(ఆర్మూర్) : మరోమారు ఆర్మూర్ నియోజకవర్గంలో ప్రజలు తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని, నిరంతరం ప్రజ సేవకు అంకితమై ఉంటానని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నందిపేట పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను మంజూరు చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పథకాలు దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఎంపీపీ వాకిడి సంతోష్ రెడ్డి, జెడ్పీటీసీ ఎర్రం జమున ముత్యం, ముచ్చర్ల సాగర్, లింగం, ఉప సర్పంచ్ భరత్ తదితరులు పాల్గొన్నారు

బీఆర్ఎస్‌లో చేరిక

డొంకేశ్వర్(ఆర్మూర్): ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సోమవారం డొంకేశ్వర్ మండలం మారంపల్లిలో పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలోని రజక సంఘం సభ్యులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కండువా కప్పి వారిని పార్టీలోనికి ఆహ్వానించారు. ఎంపీటీసీ జనార్ధన్, ఉప సర్పంచ్ అ ర్గుల రవి, రజకసంఘ అధ్యక్షుడు నర్సయ్య ఉన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

పెర్కిట్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్ పెంచడంతో సోమవారం ఆలూర్‌లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని వారు సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, దివ్యాంగులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ఆర్మూర్‌టౌన్: గత రెండు సంవత్సరాలుగా గీతా ట్రేడర్స్ బీడీ కంపెనీ యాజమాన్యం ఒర్జి బీడీల మీద పని చేయించుకొని బీడీ కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలని టేకేదారులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం వారు పట్టణంలోని కార్యాలయం ఎదుట వారు ఆందోళన చేపట్టారు. కార్మికులకు ఇవ్వాల్సిన రూ.89లక్షలు చెల్లించకపోవడంతో తమకు ఇబ్బందిగా మారిందని టేకేదారులు పేర్కొన్నారు. అనంతరం బీడీ కంపెనీ దుకాణానికి తాళం వేశారు. తమకు రావాల్సిన నగదు మొత్తాన్ని చెల్లించాలని లేనిపక్షంలో బీడీ కార్మికులను తీసుకువచ్చి ఆందోళన ఉధృతం చేస్తామని కంపెనీ యజమానికి హెచ్చరించారు.



బీడీ కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న టేకేదార్లు

గోదాం నిర్మాణానికి నిధులు మంజూరు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం గోదాం నిర్మాణానికి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రూ. 10 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈమేరకు సోమవారం వేల్పూర్‌లో మంత్రి ప్రొసీడింగ్ కాపీని సొసైటీ పాలకవర్గం సభ్యులకు అందజేశారు. అదేవిధంగా మండలంలోని పలు కుల సంఘాల భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. ఈమేరకు ప్రొసీడింగ్ కాపీలను ఆయ కులసంఘాల ప్రతినిధులకు మంత్రి అందజేశారు.



నిధుల ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న మంత్రి

అడుగడుగునా గుంతలే!

- అధ్వానంగా అంతర్రాష్ట్ర రోడ్డు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



నాగన్‌పల్లి పసుపు వాగు వద్ద అంతర్రాష్ట్ర రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలు



బోధన్ శివారులోని మర్రి మైసమ్మ ఆలయం వద్ద..

బోధన్: పట్టణ శివారు నుంచి నాగన్‌పల్లి, సాలూర క్యాంప్, సాలూర మండలకేంద్రం మీదుగా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వరకు 8కిలోమీటర్ల పొడువున విస్తరించి ఉన్న మహారాష్ట్రకు వెళ్లె అంతర్రాష్ట్ర రోడ్డుకు పలు ప్రాంతాల్లో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. నాగన్‌పల్లి గ్రామం వద్ద పసుపు వాగుకు మార్గంలో రోడ్డుకు భారీ గుంతలు ఏర్పడగా అధికారులు కొన్ని రోజుల క్రితం మొరంతో పూడ్చి చదును చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మొరం కొట్టుకుపోయి గుంతలు తేలాయి. ఈ రోడ్డు మీదుగా మండలంలోని 15గ్రామాల ప్రజలతో పాటు మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి వాహనాల రాకపోకల సంఖ్య అత్యధికంగా ఉంటుంది. ద్విచక్ర వాహనదారులు, ప్యాసింజర్ ఆటోలు, కార్లు, ఇతర వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షం నీరు నిలిచి గుంతలు కనిపించక ద్విచక్రవాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు.

హైవే అథారిటీకి మారినా..

అంతరాష్ట్ర రోడ్డు ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి నేషనల్ హైవే అథారిటీ పరిధిలోని వెళ్లింది. ఈక్రమంలో సాలూర మండల కేంద్రానికి సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర ప్రాంతం జాతీయ రహదారి-63కు అనుసంధానంగా పట్టణ శివారు నుంచి సాలూర అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు పది నెలల క్రితం చేపట్టారు. నాగన్‌పల్లి, సాలూర క్యాంప్, సాలూర గ్రామ శివారులో బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు సాగుతున్నాయి. మిగిలిన చోట్ల పాత రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఈ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్డుపై గుంతల వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై గుంతలు పూడ్చి, సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్తం

బీఎం నాగరాజును కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఆర్మూర్: హైదరాబాద్ గాంధీ భవన్‌లో సోమవారం నిజామాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ పరిశీలకుడు, ఏఐసీసీ ఇన్‌చార్జి బీఎం నాగరాజును టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్, బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు గోర్తా రాజేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో చర్చించినట్లు నాయకులు తెలిపారు. ఎవరికి టికెట్ కేటాయించిన అందరు కలుపుకుని పనిచేయాలని ఆయన సూచించినట్లు నాయకులు తెలిపారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

మాక్లూర్: మండలంలో పలువురిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికచేశామని, నేడు వారికి కుమండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈవో రాజ్‌గంగారెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎంపికైన ఉపాధ్యాయులందరు సకాలంలో హాజరు కావాలని కోరారు. అలాగే మండలంలోని బోర్గాం (కె) ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి శివాలయంలో లింగానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలు, అన్నదానం స్వీకరించారు.

వర్షంలో కార్మికుల దీక్షలు



బోధన్: పట్టణంలోని నిజాం షుగర్‌ఫ్యాక్టరీ కార్మికులు బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 31వ రోజు కొనసాగాయి. వర్షంలోనూ కార్మికులు దీక్షలు కొనసాగించారు. కార్మికులు రఘునాథ్, నయిమోద్దీన్, శ్రీనివాస్, శ్రీధర్‌లు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



రెంజల్(బోధన్): మండల కేంద్రంతో పాటు సాటాపూర్ గ్రామంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు, సర్పంచ్‌లు మర్ల రమేశ్‌కుమార్, ఎఖార్‌పాష పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు..



ఎడపల్లి(బోధన్): మండలకేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం 8, 9,10వ తరగతులలో ప్రతిభ కనబరిచి విద్యార్థులకు కెనరా బ్యాంక్ వారు రూ.5వేల చొప్పున మొత్తం రూ.15వేల బ్యాంక్ డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో స్కాలర్‌షిప్‌లను అందజేశారు. బ్యాంక్ మేనేజర్ సునీల్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన హనుమాన్ ఇటీవల తన ఫోన్ పొగొట్టుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఎస్సైగోపి ,పోలీసులు ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడికి అందజేశారు

గొర్రెల యూనిట్ల పంపిణీ



వేల్పూర్: మండలంలోని మోతె, వెంకటాపూర్ గ్రామాల్లో సోమవారం గొల్ల కుర్మలకు గొర్రెల యూనిట్లను ప్రజాప్రతినిధులు, అధికారులు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు దోర్ల రాజేశ్వర్ రెడ్డి, పాలేపు బాలరాజ్, ర్యాద మహేష్, వెటర్నరీ వైద్యుడు సంతోషరెడ్డి పాల్గొన్నారు.

స్వర్ణకారులను ఆదుకోవాలి



బాల్కొండ: తమను ప్రభుత్వం ఆదుకోవాలని స్వర్ణకారులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం మండల కేంద్రంలో దుకాణాలను మూసివేసి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ జువెల్లరీ దుకాణాలతో స్వర్ణకారుల వృత్తి ప్రమాదంలో పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్వర్ణకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ స్వర్ణకారులు పాల్గొన్నారు.

10 నుంచి ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళా

బోధన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఈ నెల 10నుంచి 25 వరకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మెగా మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని 18నుంచి 30 ఏళ్ల వయస్సు ఉన్న యువతీయువకులు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బోధన్ పట్టణం, మండలం, సాలూర, ఎడపల్లి, రెంజల్ మండలాల వారు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో, నవీపేట మండలం వారు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ మెమో, బోనఫైడ్, రెండు పాస్ పోర్టు సైజ్ ఫోటోలు వెంట తీసుకురావాలని సూచించారు. వివరాలకు 9676228008(బోధన్), 99492 04273 (నవీపేట)ను సంప్రదించాలని కోరారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 -	జైలర్ (తెలుగు)- 12.40 లవ్ ఆల్ (తెలుగు) - 4.05, బెదురులంక (తెలుగు)-7.00, 10.10
స్క్రీన్-2 -	ఖుషి (తెలుగు) - 11.45, 3.10, 6.35, 10.00
స్క్రీన్-3 -	బెదురులంక (తెలుగు) - 11.45, 2.55 ఖుషి (తెలుగు) 6.05, 9.30
స్క్రీన్-4 -	జైలర్ (తెలుగు)- 11.30,2.55, 6.20, 9.45

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



రుద్రూర్: పెండింగ్ బిల్లులు చెల్లించాలని సోమవారం పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట మాజీ జెడ్పీటీసీ పుప్పాల శంకర్, స్థానికులతో కలిసి నిరసన తెలిపారు. 2016లో టీజీబీ బ్యాంకు భవనం కోసం అప్పటి మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి హామీ మేరకు భవనాన్ని రెండు నెలల్లోనే పూర్తి చేసి అప్పగించానన్నారు. కాని ఇప్పటి వరకు బిల్లులు రాలేదని నిరసన వ్యక్తం చేశారు. స్పీకర్ స్పందించి తమకు రావాల్సిన బిల్లులు ఇప్పించాలని కోరారు.